క్లుప్తంగా

అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగా బుల్లెమ్మ బాధ్యతల స్వీకరణ



పెద్దాపురం: పెద్దాపురం అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగా జి.బుల్లెమ్మ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఏలూరు కోర్టులో న్యాయవాదిగా విధులు నిర్వర్తిస్తూ న్యాయమూర్తిగా పదోన్నతిపై పెద్దాపురం కోర్టుకు బదిలీపై వచ్చారు. ఇప్పటివరకూ ఆ స్థానంలో విధులు నిర్వర్తిస్తున్న హర్షవర్ధన్ పెద్దాపురం కోర్టులోనే పదోన్నతిపై ప్రిన్సిపాల్ జూనియర్ జడ్జిగా నియమితులయ్యారు. అడిషనల్ జూనియర్ మెజిస్ట్రేట్‌గా విధులు చేపట్టిన బుల్లెమ్మను పలువురు న్యాయవాదులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

బాలికను తల్లిదండ్రులకు అప్పగించిన ఎస్ఐ



బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు

సామర్లకోట: ట్రాఫిక్ ఎస్ఐ ఒంటరిగా వెళుతున్న బాలికను గుర్తించి ఆమె తల్లిదండ్రులకు అప్పగించిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. స్థానిక గౌతమి మోడల్ స్కూలులో ఐదో తరగతి చదువుతున్న పీకే మాధురిని ఆమె తండ్రి లోవబాబు రోజూ మోటారు సైకిలుపై పాఠశాలకు తీసుకువెళతాడు. అయితే మాధురి బుధవారం ఉదయం నడిచి స్కూలుకు వెళతానని చెప్పడంతో దగ్గరే కదా అని ఒప్పుకున్నారు. అయితే లారీ స్టాండ్ నుంచి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జికి ఒంటరిగా నడిచి వెళ్లిన మాధురి అటు నుంచి ఎటు వెళ్లాలో అర్థం కాక ఆగిపోయింది. తరగతులు ప్రారంభమైనా పాఠశాలకు మాధురి రాలేదని స్కూల్ నుంచి టీచర్లు చెప్పడంతో బాలిక తల్లిదండ్రుల్లో కలవరం మొదలైంది. ఇంతలో ఫ్లైఓవర్ బ్రిడ్జిపై విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు బాలికను ప్రశ్నించి ఆమె పుస్తకాల బ్యాగ్‌లోని డైరీలో ఉన్న ఫోన్ నెంబర్ ఆధారంగా తల్లిదండ్రులకు సమాచారమివ్వడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేసి బాలికను అప్పగించారు.

బైక్ అదుపు తప్పి యువకుడికి గాయాలు

పెద్దాపురం: వేగంగా వెళుతున్న బైక్ అదుపు తప్పి యువకుడు తీవ్ర గాయాల పాలైన ఘటన బుధవారం సాయంత్రం పెద్దాపురం మండలం సిరివాడలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గుడివాడ గ్రామానికి చెందిన పెదిరెడ్ల నాగేంద్ర(29) తన బంధువుల ఇంటికి బైక్‌పై వెళుతుండగా అదుపు తప్పి రోడ్డుపై పడిపోయాడు. ఈ ప్రమాదంలో నాగేంద్రకు తీవ్ర గాయాలవ్వడంతో స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పెద్దాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చెందుర్తి సెంటర్లో 16వ నంబరు జాతీయ రహదారిపై వాహనం ఢీకొని ఒక గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. బుధవారం తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదంలో సుమారు 30 ఏళ్ల వ్యక్తి చనిపోయి రక్తపు మడుగులో పడి ఉన్నట్లు స్థానిక వీఆర్‌ఓ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్‌ప్రతాప్ తెలిపారు.

వివాహిత అదృశ్యం

కొత్తపల్లి: ఒక వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు బుధవారం తెలిపారు. మండలంలోని పాత ఇసుకపల్లికి చెందిన ఎస్.ఉమామహేశ్వరి భద్రాచలానికి చెందిన దేవీ వరప్రసాద్‌తో గతంలో వివాహమైంది. ఈ నెల 13న తన పుట్టింటికి వచ్చింది. ఈ నెల 20న బయటకు వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాకపోవడంతో భర్త దేవీవరప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై రామలింగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బ్యాంక్ లింకేజీలపై దృష్టి పెట్టండి

కాకినాడ: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో లబ్ధిదారులకు రూ.35 వేల బ్యాంకు లింకేజీ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ ఆదేశించారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం కొమరగిరి లే అవుట్‌లో గృహనిర్మాణ ప్రగతిపై అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావుతో కలిసి హౌసింగ్, ప్రత్యేకాధికారులు, ఇతర శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. గృహ నిర్మాణాల కోసం సుమారు 9416 మంది అగ్రిమెంట్లు పూర్తి చేసుకోగా, 3,300 ఇళ్లు గ్రౌండింగ్‌లో ఉన్నాయన్నారు. 4,536 మంది లబ్ధిదారులకు రూ.35 వేల చొప్పున బ్యాంకు లింకేజీ పూర్తయ్యిందని, మిగిలిన ఐదు వేల మందికి త్వరితగతిన లింకేజి ప్రక్రియ పూర్తయ్యేలా బ్యాంకర్లతో చర్చించాలని సూచించారు. ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లింపు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, గృహనిర్మాణశాఖ డీఈ సత్యనారాయణరెడ్డి, నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, మేనేజర్ కర్రి సత్యనారాయణ పాల్గొన్నారు.

శిథిలమైన చెక్‌డ్యాంలతో సాగునీరు వృథా



వీకే రాయపురం సత్యవరపుపేట వద్ద శిథిలమైన చెక్‌డ్యాం

- నీటి ఎద్దడితో అన్నదాతలకు ఇక్కట్లు
- అధికారులు పట్టించుకోవట్లేదని రైతుల ఆగ్రహం

సామర్లకోట: చెక్ డ్యాంలు శిథిల స్థితిలో ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల శివారు ప్రాంతాలకు నీరందక తమ పొలాలు ఎండిపోతున్నాయంటున్నారు. గోదావరి కాలువ వెంబడి ఉన్న చెక్‌డ్యాంలు, కల్వర్టులు, స్లూయిజ్‌లు, గట్లను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం నుంచి పెద్ద ఎత్తున నిధులు విడుదల అవుతున్నా మరమ్మతులు చేయడం లేదు. కేవలం అధికారుల నిర్లక్ష్యం కారణంగానే చెక్‌డ్యాంలు బాగుపడటం లేదని రైతు సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు.

ఇదీ పరిస్థితి

సామర్లకోట గోదావరి కాలువ నుంచి రామేశ్వరంలో లెవెల్, హై లెవెల్ కాలువలు మండల పరిధిలోని వీకే రాయపురం సత్యవరపుపేట మీదుగా వెళుతున్నాయి. సత్యవరపుపేట వద్ద ఉన్న చెక్‌డ్యాం గత ఏడేళ్లుగా శిథిల స్థితిలో ఉన్నా ఇరిగేషన్ అధికారులు దాని వంక కన్నెత్తి చూడలేదు. చెక్ డ్యాం శిథిలమవ్వడంతో పల్లపు కాలువకు ఎక్కువ స్థాయిలో నీరు వెళ్లిపోతుంది. ఎగువ కాలువకు మాత్రం నీరందని దుస్థితి ఏర్పడింది. పల్లపు కాలువ నుంచి బోయనపూడి, రామేశ్వరం, వేట్లపాలెం పరిధిలోని పొలాలకు నీరందుతుంది. ఎగువ కాలువ నుంచి వీకే రాయపురం, బోయనపూడి గ్రామాల్లోని పొలాలకు నీరిస్తారు. ఈ రెండు కాలువలపై ఏర్పాటుచేసిన చెక్‌డ్యాంలు శిథిలమయ్యాయని రైతులు చెబుతున్నారు. ఉండూరు పరిధిలోని రైతుల పంట పొలాలకు సాగు నీరు అందించడానికి ఏర్పాటు చేసిన చెక్‌డ్యాంలు సైతం శిథిల స్థితికి చేరుకున్నాయి. ఈ విషయాలన్నీ అధికారులకు తెలిసినా మౌనం వహిస్తున్నారని, ఇప్పటికైనా స్పందించి చెక్‌డ్యాంలకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టడం లేదు



ఏడేళ్ల క్రితమే చెక్‌డ్యాం శిథిలమై సాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రధానంగా దాళ్వాలో నీటి సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది. అధికారుల్ని ఎప్పుడు ప్రశ్నించినా చెక్‌డ్యాం మరమ్మతులకు నిధులొచ్చాయని చెప్పడమే తప్ప పనులు చేపట్టడం లేదు.

– వెలమర్తి బుల్లిరాజు, రైతు, వీకే రాయపురం

వేసవిలో పనులు చేయిస్తాం



వీకే రాయపురం వద్ద ఉన్న చెక్‌డ్యాం పూర్తిగా శిథిలమైంది. ఈ కారణంగానే నీరు వృథాగా సముద్రంలో కలిసిపోయి ఎగువ ప్రాంతంలోని పొలాలకు నీరందడం లేదు. చెక్‌డ్యాం మరమ్మతుల అంచనాలు తయారుచేసి వేసవిలో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

– నాగేశ్వరరావు, ఇరిగేషన్ ఏఈ, సామర్లకోట

తీరానికి మణిహారం మేజర్ హార్బర్



హార్బర్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

- 50 ఏళ్ల కల నిజం చేసిన సీఎం జగన్
- 50 వేల కుటుంబాలకు జీవనాధారం
- ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: తీరప్రాంతానికి ఉప్పాడ హార్బర్ మణిహారంగా నిలుస్తుందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మేజర్ హార్బర్ నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. 50 ఏళ్ల తీర ప్రాంత ప్రజలు కలలను సీఎం జగన్ నిజం చేశారన్నారు. రూ.422 కోట్లతో ఉప్పాడలో చేపట్టిన మేజర్ హార్బర్ నిర్మాణ పనులు 50 శాతానికి పైగా పూర్తి అయినట్టు తెలిపారు. ఈ హార్బర్ ఆగస్టులో ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నట్టు తెలిపారు. సుమారు 2500 బోట్లు నిలిచేలా, సుమారు లక్షా పది వేల 624 మెట్రిక్ టన్నుల ఎగుమతులు లక్ష్యంగా నిర్మిస్తున్నామన్నారు. ఈ ప్రాంతమే కాకుండా సుమారు 50 వేల కుటుంబాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనోపాధి కలుగుతుందన్నారు. మత్స్యకారులకు అందిస్తున్న ఆయిల్ సబ్సిడీని పెంచడమే కాకుండా వేట నిషేధ సమయంలో అందించే పరిహారం రూ.10 వేలకు పెంచి, వేట సమయంలో ప్రమాదవశాత్తు మత్స్యకారులు మృతి చెందితే రూ.10 లక్షలు పరిహారాన్ని త్వరగా చెల్లించేలా చర్యలు చేపట్టారు. సముద్ర కోతకు గురై ఇళ్లు కోల్పోయిన మత్స్యకార కుటుంబాలకు 600 పట్టాలు ఇచ్చినట్టు తెలిపారు. బీచ్‌రోడ్డు అభివృద్ధికి రూ.34 కోట్లు, తీరప్రాంత రక్షణకు జియోట్యూబు నిర్మాణానికి రూ.30 కోట్లు కేటాయించినట్టు తెలిపారు. ఇది టెండర్ ప్రక్రియలో ఉందని తెలిపారు. ఫిషింగ్ హార్బర్ ఈఈ మునిరెడ్డి, మత్స్యశాఖ ఏడీ శ్రావణి కుమారి, మండల కోఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు మాదిరెడ్డి దొరబాబు, చెట్టుబత్తిన సురేష్‌కుమార్, సర్పంచులు, మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన వర్గాలకు పెద్దపీట..

వెనుకబడిన బీసీ వర్గాలకు వైఎస్సార్ ప్రభుత్వం పెద్దపీట వేసిందనడానికి ఎమ్మెల్సీ స్థానాలను కేటాయించడమే నిదర్శనమని ఎమ్మెల్యే దొరబాబు అన్నారు. రాష్ట్రంలో 18 స్థానాలకు 11 స్థానాలు బీసీలకే కేటాయించారన్నారు. కాకినాడ, వైజాగ్‌లో ఎమ్మెల్సీ స్థానాలను మత్స్యకారులకు కేటాయించడం హర్షణీయమన్నారు.

విజయవంతంగా శివరాత్రి ఉత్సవాలు



పిఠాపురంలో పాదగయ క్షేత్రంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- అధికారులకు అభినందనలు

పిఠాపురం: పాదగయ క్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించామని, ఈ ఉత్సవాల్లో సామాన్య భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించినట్టు ఎమ్మెల్యే పెండెం దొరబాబు తెలిపారు. క్షేత్రంలో మంగళవారం రాత్రి సంబంధిత అధికారులను ఆయన అభినందించారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, వైద్య, మరుగుదొడ్లు ఇతర సౌకర్యాలు కల్పించి, ఎవరికీ ఇబ్బంది లేకుండా చేశారన్నారు. మాస శివరాత్రి, మహా శివరాత్రి, శని త్రయోదశి కలిసి రావడంతో సుమారు 4 లక్షలకు పైగా భక్తులు పాదగయ పుష్కరిణిలో పుణ్య స్నానాలు చేశారన్నారు. లక్షలాది మంది భక్తులను అదుపు చేయడం కష్టంతో కూడుకున్న పని అయినప్పటికీ ఎవరినీ ఇబ్బంది పెట్టకుండా అధికారులు తీసుకున్న చర్యలు సత్ఫలితాలనిచ్చాయన్నారు. ఈ ఏడాది ఎక్కువ మంది భక్తులు స్వామి వారి దర్శనాలకు రావడం చాలా సంతోషం కలిగించిందన్నారు. దర్శనానికి వచ్చే భక్తులకు ఏర్పాటు చేసిన క్యూలైన్ల వల్ల భక్తులు అధిక సంఖ్యలో వచ్చినప్పటికీ అందరు సక్రమంగా పుణ్య స్నానంతో పాటు స్వామి వారి దర్శనం చేసుకున్నారన్నారు. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు, ఈఓ సౌజన్య, ఈఓ శ్రీనివాస్, మున్సిపల్, పోలీసు, విద్యుత్, శానిటరీ, ఇంజినీరింగ్, రోడ్లు భవనాల శాఖ, హెల్త్, శాఖల అధికారులు, ట్రస్టు బోర్డు సభ్యులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో తీసుకున్న భద్రతా చర్యలు ప్రశంసనీయమని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఉత్సవాల్లో పాల్గొన్న ప్రతి అధికారులకు సిబ్బందికి పేరు పేరునా అభినందనలు తెలిపారు.

కౌన్సిలర్‌ను పరామర్శించిన దొరబాబు



కౌన్సిలర్ మోహన్‌ను పరామర్శిస్తున్న దొరబాబు

సామర్లకోట: వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ జట్ల మోహన్ తండ్రి సుబ్బారావు ఇటీవల మృతి చెందారు. దీంతో కౌన్సిలర్ మోహన్‌ను రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు బుధవారం పరామర్శించి తన సంతాపం తెలియజేశారు. దొరబాబు వెంట సొసైటీ అధ్యక్షుడు మేకా శ్రీనివాస్, కౌన్సిలర్లు ఆవాల లక్ష్మీనారాయణ, యార్లగడ్డ జగదీశ్వరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ కోశాధికారి శెట్టిబత్తుల దుర్గారావు, మాగాపు గోపి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ ఆశీల వేలం వాయిదా



సామర్లకోట మున్సిపల్ కార్యాలయంలో వేలం నిర్వహిస్తున్న దృశ్యం

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలోని రోడ్డు మార్జిన్‌లో వ్యాపారాలు చేసుకునే వారి నుంచి మార్కెట్‌లో ఆశీలు వసూలు చేసుకోవడానికి బుధవారం చేపట్టిన మార్కెట్ ఆశీల వేలం వాయిదా పడింది. మున్సిపల్ కమిషనర్ నయాం అహ్మద్ అధ్యక్షతన మార్కెట్ ఆశీలు, మేకల కబేళా, పశువుల కబేళా వేలం పాటలను నిర్వహించారు. మార్కెట్ ఆశీల పాటకు పాటదారులు ముందుకు రాకపోవడంతో వాయిదా వేసినట్లు కమిషనర్ ప్రకటించారు. మేకల కబేళా రూ.80 వేలకు రోటా శ్రీనివాస్, పశువుల కబేళా రూ.1.60 లక్షలకు అబ్దుల్ అజీజ్‌లను హెచ్చు పాటదారులుగా గుర్తించామని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్వో పూడి రవిబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఫిల్టర్ బెడ్ చెరువులో తగ్గిన నీటి మట్టం

- పరిశీలించిన అధికారులు, పాలక మండలి



సామర్లకోటలో వాటర్ వర్క్ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్, వైస్ చైర్మన్‌లు

సామర్లకోట: పట్టణ ప్రజలకు తాగునీరు అందించే ఫిల్టర్ బెడ్ చెరువు(నాగార్జున చెరువు)లో నీటి మట్టం తగ్గిపోయింది. ఈ కారణంగా తాగునీటి సమస్య ఏర్పడే అవకాశమున్న నేపథ్యంలో బుధవారం చెరువును కమిషనర్ నయాం అహ్మద్, వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, డీఈ హుస్సేన్ పరిశీలించారు. గోదావరి కాలువలో నీటిమట్టం తగ్గిపోవడం వల్ల ఏలేరు ప్రాజెక్టు నుంచి నీరు ఇచ్చే విధంగా ఇరిగేషన్ ఎస్ఈతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ మేరకు ఫిల్టర్ ప్లాంటు సిబ్బందితో పాటు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించి తాగునీటి ఎద్దడి లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. తాగునీటి, సాగునీటి సమస్య నేపథ్యంలో ఏలేరు ప్రాజెక్టు నుంచి నీటిని గోదావరి కాలువలోకి విడిచిపెట్టే ఏర్పాటు చేయడానికి ఇరిగేషన్ అధికారులు హామీ ఇచ్చినట్లు వైస్ చైర్మన్ మోజెస్ తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు గంగిరెడ్డి కృష్ణమూర్తి, ఏఈ భాస్కర అరవింద నాగసాయికుమార్, గిడుతూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలి



పవర గ్రామంలో జగనన్న కాలనీని పరిశీలించిన ఎంపీడీఓ

సామర్లకోట: ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల స్థలాల్లో ఇళ్లను వేగంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ డి.శ్రీలలిత అన్నారు. బుధవారం సాయంత్రం మండల పరిధిలోని పవర గ్రామంలో జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను ఆమె పరిశీలించారు. లబ్ధిదారులకు ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80 లక్షలతో పాటు మహిళా సంఘాలకు బ్యాంకులు ఇస్తున్న రూ.35 వేలతో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ ఈ–కేవైసీలో గొంచాల, అచ్చంపేట గ్రామాలు వెనుకబడి ఉండటంతో స్థానిక వలంటీర్లతో ఎంపీడీఓ శ్రీలలిత సమీక్షా సమాశం నిర్వహించారు. గొంచాల నుంచి ఒకరు, అచ్చంపేట నుంచి ఇద్దరు వలంటీర్లు గైర్హాజరు కావడంతో వారికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు ఎంపీడీఓ ప్రకటించారు. ఈ కార్యక్రమాల్లో ఈఓపీఆర్డీ హిమమహేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

‘రైతు పొలం సందర్శన’ తో సాగులో మెళకువలు



చేబ్రోలు ఆర్బీకేను సందర్శించిన డాక్టర్ నాయక్, డాక్టర్ వెంకటనరసింహారావు, విద్యార్థులు

పిఠాపురం: గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా బుధవారం గొల్లప్రోలు మండలం దుర్గాడ చేబ్రోలులో రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతు పొలం సందర్శన నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సీహెచ్ శ్యామ్ రాజ్ నాయక్, జిల్లా ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకటనరసింహారావు గ్రామాల్లో నివాసం ఉండి రైతుల అనుభవాలను నేర్చుకుంటున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులను కలుసుకున్నారు. పొలాలను సందర్శించి రైతు స్థితిగతులను, ఆర్బీకేల పనితీరును, విద్యార్థుల పని అనుభవాలను పరిశీలించారు. నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు రైతులతో సన్నిహితంగా ఉంటూ సాగులో అనుభవాన్ని గడిస్తున్నారన్నారు. ఆర్బీకేల పనితీరు బాగుందని డాక్టర్ చల్లా తెలియజేసారు. అనంతరం రైతులకు ఎలుకల నివారణ మందులను పంపిణీ చేశారు.

తైక్వాండోలో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన సత్య, శిరీష

కొత్తపల్లి: జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో పిఠాపురంలో నిర్వహించిన తైక్వాండో జిల్లాస్థాయి పోటీల్లో వీవీఎస్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు విద్యాసంస్థల కరస్పాండెంట్ అనిశెట్టి కృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. ఆరో తరగతి చదువుతున్న కె.సత్య స్వర్ణ పతకం, 4వ తరగతి చదువుతున్న కె.శిరీష రజత పతకం సాధించినట్టు తెలిపారు.

శిలువ ధ్యాన కూడికలు ప్రారంభం

సామర్లకోట: క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకునే 40 దినాల శిలువ ధ్యాన కూడికలు చర్చిల్లో బుధవారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఏసుక్రీస్తు శిలువపై మరణించిన రోజుకు ముందుగా ఉన్న 40 రోజుల పాటు ఉపవాస దీక్షలతో ప్రత్యేక ఆరాధనలు నిర్వహించడం పరిపాటిగా జరుగుతుంది. ఆంధ్రా బాప్టిస్టు చర్చి, సెంటినరీ బాప్టిస్టు చర్చి, అగస్థాన లూథరన్ చర్చి, షాలెం బాప్టిస్టు చర్చిల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

స్కానింగ్ ధరలు ప్రదర్శించాలి

కాకినాడ క్రైం: స్కానింగ్ కేంద్రాలు ధరల పట్టీని కచ్చితంగా ప్రదర్శించాలని పీసీపీఎన్‌డీటీ రాష్ట్ర అదనపు సంచాలకుడు, రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ కె.అనిల్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్కానింగ్ కేంద్రాల నిర్వహణ, ఏఆర్‌టీ, సరోగసి కేంద్రాల అనుమతుల అంశాలపై బుధవారం ఆయన జిల్లా అధికారులతో జూమ్ కాన్ఫరెన్సు నిర్వహించారు. ప్రైవేటు, ప్రభుత్వ స్కానింగ్ కేంద్రాల పనితీరును సమీక్షించారు. స్కానింగ్ కేంద్రాల యాజమాన్యాలు గర్భిణుల వివరాలు తప్పకుండా ఫారం–ఎఫ్‌లో పొందుపరిచి అప్‌లోడ్ చేయాలని సూచించారు. డివిజినల్, ప్రోగ్రాం అధికారుల సమక్షంలో తప్పకుండా డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలని ఆదేశాలిచ్చారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

- ఉద్యాన శాఖాధికారి సుజాత



రైతు సదస్సులో మాట్లాడుతున్న ఉద్యానశాఖాధికారి సుజాత

పెద్దాపురం: రైతులు ఆయిల్ పాం సాగులో సమగ్ర యాజమాన్య సస్యరక్షణ పోషక పద్ధతులు పాటిస్తే అధిక దిగబడులు సాధించొచ్చని పెద్దాపురం మండల ఉద్యాన శాఖాధికారి ఎస్.సుజాత అన్నారు. మండలంలోని కొండపల్లి గ్రామంలో కొండబాబు పామాయిల్ తోటలో బుధవారం ఉద్యాన శాఖ, పతంజలి ప్రైవేట్ లిమిటెడ్స్ సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు పామాయిల్ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖాధికారి ఎస్.సుజాత మాట్లాడుతూ బిందు సేద్యం, తెల్లదోమ నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పతంజలి డీజీఎం రవీంద్ర, పి.దుర్గారావు, కె.వెంకటేశ్వరరావు, డీఎల్ వెంకటేశ్వరరావు, ఎం.వెంకటసాయి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆపద్బాంధవుడు



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేస్తున్న దొరబాబు

సామర్లకోట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆపదలో ఉన్నవారిని ఆదుకునే ఆపద్బాంధవుడని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. నియోజకవర్గ పరిధిలో ఆరోగ్యశ్రీ అందని బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వచ్చిన చెక్కులను దవులూరి దొరబాబు బుధవారం అందజేశారు. సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామానికి చెందిన కర్రి శ్రీనుకు రూ.80 వేలు, పనసపాడు గ్రామానికి చెందిన కందల సుబ్బారావుకు రూ.55 వేలు, బోయనపూడికి చెందిన చల్లా వెంకటరత్నంకు రూ.18 వేలు, పెద్దాపురంకు చెందిన చోడబత్తుల కుసుమవతికి రూ.17 వేలు, పెద్దాపురంకు చెందిన మేకా సత్యవతికి రూ.26 వేలు, పెద్దాపురంకు చెందిన గవరసాన నాగలక్ష్మికి రూ.15వేలు, పెద్దాపురంకు చెందిన గండ్రేటి నూకరాజుకు రూ.46 వేలు ఆర్థిక సాయంగా చెక్కులను దొరబాబు బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం మున్సిపల్ వైస్‌చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, ఇనుకోట విష్ణుచక్రం, సామర్లకోట వైస్ ఎంపీపీ ములసా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నూకాలమ్మ అమ్మవారి తొలి గరగ ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మండలం కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారి తొలి గరగ ఉత్సవం బుధవారం రాత్రి అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి టీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన గరగ ఉత్సవంలో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, సొసైటీ అధ్యక్షుడు పల్లా గంగారావు, దేవస్థానం చైర్మన్ గవరసాని వీరాస్వామి, సర్పంచ్ శ్రీనివాస్ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయం నుంచి తొలి గరగ ఉత్సవాన్ని జెడ్పీటీసీ సూరిబాబు ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఆలయం నుంచి గరగను బ్యాండ్ మేళాలు, డప్పు వాయిద్యాల నడుమ ఊరేగించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జోకా నానాజీ, ఎంపీటీసీ జాగు వీరభద్రరావు, ఆలయ ధర్మకర్తలు లక్కాకుల కృష్ణ, నాయకులు గంటా రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎఫ్‌టీయూలో పారిశుధ్య కార్మికుల చేరిక



కమిషనర్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

పిఠాపురం: అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఏఐఎఫ్‌టీయూ)లో గొల్లప్రోలు నగర పంచాయతీ పారిశుధ్య కార్మికులు చేరినట్లు సమాఖ్య మాజీ నాయకులు కుంచే అంజిబాబు, డి.నారాయణమూర్తి బుధవారం తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల ప్రధాన కార్యదర్శి రంబాల సతీష్ సమక్షంలో వారు చేరడం ఆనందదాయకం అన్నారు. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు నగర పంచాయతీ కమిషనర్ ఎం.సత్యనారాయణకు వినతి పత్రం అందజేసారు. కార్మికులు జి.రాజబాబు, ఐ.నూకరాజు, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

నిత్య చైతన్య దీప్తి ‘మహాప్రస్థానం’



కార్యక్రమంలో మాట్లాడుతున్న జనవిజ్ఞాన వేదిక నాయకులు

కాకినాడ సిటీ: శ్రీశ్రీ మహాప్రస్థానం నిత్య చైతన్య దీప్తి అని వక్తలు పేర్కొన్నారు. మంగళవారం రాత్రి కచేరిపేట యూటీఎఫ్ హోంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శ్రీశ్రీ మహాప్రస్థానం సామూహిక పఠనం నిర్వహించారు. కార్యక్రమానికి యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకరవర్మ అధ్యక్షత వహించి మాట్లాడుతూ అభ్యుదయ ప్రచురణ సంస్థలు ఫిబ్రవరి 21 రెడ్‌బుక్ డేగా నిర్వహించాలని ఇచ్చిన పిలుపులో భాగంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శ్రీశ్రీ మహాప్రస్థానం సామూహిక పఠనం ఏర్పాటు చేశామన్నారు. ప్రముఖ సాహితీవేత్త అద్దేపల్లి ప్రభు మాట్లాడుతూ శ్రీశ్రీ రచనల గొప్పతనాన్ని వివరించారు. సామాజిక కోణంలో రచనలకు శ్రీశ్రీ నాంది పలికారన్నారు. దోపిడీ సమాజాన్ని కూలగొట్టి, సోషలిస్టు సమాజ నిర్మాణ లక్ష్యంగా శ్రీశ్రీ రచనలు సాగాయన్నారు. కార్యక్రమ నిర్వాహకులను అభినందిస్తూ కవితా, ఓ కవితా ఆలపించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు కేఎంఎంఆర్ ప్రసాద్ మాట్లాడుతూ పుస్తకం మంచి స్నేహితుడన్నారు. పెన్షనర్ల సంఘం నేత సీహెచ్ సత్యనారాయణరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.